క్లుప్తంగా

ఆక్రమణలను తొలగించాలి : కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో రోడ్లను ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో తొలగించి వేస్తామని కమిషనర్ వైఓ నందన్ హెచ్చరించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక పొదలకూరు రోడ్డు, 28వ డివిజన్, 29వ డివిజన్ గాంధీనగర్ పార్కు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ల పరిధిలో జరుగుతున్న కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను పర్యవేక్షించారు. కాలువల్లో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకిగా ప్లాస్టిక్ కవర్లు, తదితర వ్యర్థాలు వేయకుండా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. రోడ్లను ఆక్రమించి కట్టిన మెట్లు, ర్యాంపులు, ఇతర నిర్మాణాలను గుర్తించి తప్పనిసరిగా తొలగించి వేస్తామని కమిషనర్ తెలిపారు. గాంధీనగర్ పార్కులో అవసరమైన అన్ని వసతులను కల్పించి నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.

అధికారులతో సమావేశం



అధికారులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 29 పార్కుల అభివృద్ధిపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్పొరేషన్ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్కుల అభివృద్ధికి రూ.7 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమనూ అర్హులుగా గుర్తించాలి

- 'తల్లికి వందనం'పై అంగన్‌వాడీల ఆవేదన



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కొడవలూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలను తల్లికి వందనం పథకానికి అర్హులుగా గుర్తించాలని వారు కొడవలూరులో డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తల్లికి వందనం పథకానికి తమను అర్హులు చేయాలని కోరుతూ సోమవారం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలసరి వేతనం రూ.12 వేల కంటే ఎక్కువ ఉందని చూపారని, వాస్తవానికి కార్యకర్తల నెలసరి వేతనం రూ.11.500లు మాత్రమేనన్నారు. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తూ 2022వ సంవత్సరం ఏప్రిల్ 19న జీఓ కూడా ఇచ్చి ఉన్నారని తెలిపారు. కార్యకర్తల జీతం రూ.12 వేల కంటే తక్కువే ఉన్నందున తమను అర్హులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు యాస్మిన్, రమీజా తదితరులు పాల్గొన్నారు.

కోడూరు బీచ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

తోటపల్లిగూడూరు: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని పర్యాటకులు అల్లం సాగర్, బత్తల వెంకటేష్, గిరీష్‌కుమార్ కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్ ఆనంద్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి బీచ్‌తో పాటు వేళాంగణి మాత చర్చికి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. దీనివల్ల రోజూ వందల సంఖ్యలో పర్యాటకులు, భక్తులు విచ్చేస్తుంటారన్నారు. అయితే మహాలక్ష్మీపురం నుంచి కోడూరు బీచ్ వరకు రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు అధ్వానంగా మారిపోయిందన్నారు. దీనిపై అధికారులు స్పందించి అస్తవ్యస్తంగా మారిన బీచ్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులను తొలగించాలన్నారు.

బస్టాండ్‌ను ఆధునికీకరిస్తాం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలో ఆధునికీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఏపీఎస్‌ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్టాండ్‌లోపల సీసీరోడ్లు, ప్రయాణికులు కూర్చునేందుకు అధునాతన కుర్చీలు తదితరాలను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఆయన వెంట ఆర్టీసీ డీఎం మురళీకృష్ణ, పలువురు బీజేపీ నాయకులున్నారు.



కనుచూపు మేరంతా..

ఏంటీ.. ఇది స్వర్ణాల చెరువా?



నిరుపయోగంగా మారిన బోట్లు

నెల్లూరులోని స్వర్ణాల చెరువుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ ప్రతి సంవత్సరం రొట్టెల పండగ జరుగుతుంది. అలాంటి చెరువు ప్రస్తుతం గుర్రపు డెక్కతో నిండిపోయింది. పండగ సమయంలో హడావుడి చేసే ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆ తర్వాత దాని గురించి పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన టూరిజం బోట్లు కూడా గుర్రపు డెక్క మధ్యలో ఇరుక్కుపోయాయి నిరుపయోగంగా మారాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

చంద్రబాబు మోసాలపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. రూరల్లోని చింతారెడ్డిపాళెంలో ఉన్న పార్టీ కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(టౌన్): స్థానిక మద్రాస్ బస్టాండ్ సమీపంలోని సుంకు చెంగన్న మున్సిపల్ పాఠశాలలో సోమవారం స్వర్ణ వేమయ్య వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన నిరుపేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే స్వర్ణ వేమయ్య 30వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు స్వర్ణ గంగాధర్ ఒక్కో విద్యార్థికి రూ.5 వేల చొప్పున 12 మందికి అందించారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ అరవింద, రామ్మోహన్, స్వర్ణ రమేష్‌బాబు, భాస్కరయ్య, డీవీ సుబ్బరాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సదారావుకు ఆత్మీయ వీడ్కోలు



సదారావును సత్కరించిన దృశ్యం

నెల్లూరు రూరల్: సమాచార శాఖ డీడీ సదారావు బదిలీపై విశాఖపట్నం వెళ్తుండటంతో జర్నలిస్టులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సోమవారం స్థానిక జర్నలిస్ట్ భవన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు బదిలీపై వెళ్లడం సర్వసాధారణమని, మీకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్ట్ నాయకులు సదారావు సేవలను గుర్తు చేసుకున్నారు.

ఏకలవ్య జయంతి ఉత్సవాలు జరపాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు రూరల్: ఎరుకుల ఆరాధ్య దైవమైన ఏకలవ్య జయంతి ఉత్సవాలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహించాలని ఏపీ ఎరుకుల సేవా సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ మహరాజ్, వాల్మీకి జయంతిని ప్రభుత్వ అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. అదే విధంగా ఏకలవ్యుని జయంతిని అధికారికంగా ప్రకటించాలని విన్నవించారు. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండి బుచ్చయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు కట్టా రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ్ల వెంకయ్య, జాయింట్ సెక్రటరీ కంప శ్యామ్, కట్ట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు



పుస్తకాన్ని ఆవిష్కరించిన పర్వతరెడ్డి, నేతలు

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'వెన్నుపోటు రాజకీయాలకు చంద్రబాబు కేరాఫ్‌గా నిలిచారు. ఐదు కోట్ల మంది ఆంధ్రులను వెన్నుపోటు పొడిచారు' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సిటీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కోవిడ్ లాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చి ప్రజలను దగా చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేసేలా వైఎస్సార్‌సీపీ అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. తల్లికి వందనం అమలులో చంద్రబాబు మాట్లాడుతూ తాను చెప్పిన అన్ని పథకాలు ఇచ్చినట్లేనని, ఎవరైనా మళ్లీ పథకాల గురించి అడిగితే వారి నాలుక కోస్తానని అనడం నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ కార్యకర్తలకు మాత్రమే అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి స్థానంలో ఉండి బాబు మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను వివరిస్తూ జగనన్న అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకం కావాలనుకునే వారు దానిపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం, నెల్లూరు జిల్లా శిక్షణా శాఖ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సుల్లో మూడునెలల ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి అధికారి ఎం.వినయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కోర్సుల్లో కలిపి 60 ఖాళీలు ఉన్నాయన్నారు. 10వ తరగతి చదివి, 18 – 30 సంవత్సరాల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. ఈనెల 24వ తేదీలోగా జిల్లా ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 91608 88066, 80089 45840 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీలో యోగా ప్రదర్శన

నెల్లూరు సిటీ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో ఉద్యోగులు, సిబ్బంది సోమవారం సామూహిక యోగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వైద్యశాఖ సిబ్బందిపై విచారణ జరపాలంటూ..

- కలెక్టర్‌కు వినతి

నెల్లూరు(అర్బన్): డాక్టర్‌కు సెలవులు మంజూరు, నిధుల విత్‌డ్రాపై అధికారులు చేపట్టిన విచారణలో తామిచ్చిన స్టేట్‌మెంట్‌ను బహిరంగపరిచిన వైద్యశాఖ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఎస్‌పేట పీహెచ్‌సీకి చెందిన నర్సింగ్ స్టాఫ్ లత, ఎఫ్ఎన్ఓ దొరసానమ్మలు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఎఫ్ఎన్ఓ దొరసానమ్మ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో పనిచేసే మరో నర్సు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక డాక్టర్ సెలవుల్లో జీతానికి సంబంధించిన అంశంపై అధికారులు విచారణ జరిపారన్నారు. అందులో 40 మందిని అధికారులు విచారించినట్టు ఉందన్నారు. తన వివరణ కూడా ఉందన్నారు. ఈ నివేదికను వైద్యశాఖ అధికారులు రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. అయితే వైద్యశాఖ సిబ్బంది లీక్ చేసిన కారణంగా పీహెచ్‌సీలో పనిచేసే మరో నర్సు తన వివరణపై కక్ష సాధింపులకు పాల్పడుతూ వేధిస్తోందన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాపూరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జేసీ కార్తీక్ తెలిపారు. సోమవారం రాపూరు మండలం పెంచలకోనలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, డ్వామా పీడీ గంగా భవాని, డీసీఓ గుర్రప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణ, ఎంపీడీఓ భవాని, తహసీల్దార్ లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గృహాలు అందజేస్తాం

- కమిషనర్ నందన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి, విజయదశమి నాటికి బీ, సీ కేటగిరీల డబుల్ బెడ్‌రూమ్ గృహాలను లబ్ధిదారులకు అందించనున్నామని కమిషనర్ వైఓ నందన్ తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి కమిషనర్ వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కేటగిరీలో గృహాలు మంజూరైనా ఇప్పటి వరకు స్వాధీనం చేసుకోని లబ్ధిదారులకు నోటీసులు అందజేస్తున్నామన్నారు. ఒకవేళ స్పందించకపోతే గృహాలను ఇతర లబ్ధిదారులకు క్రమపద్ధతిలో కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 25 భవనాలకు సంబంధించి జిల్లా కోర్టులో పిటిషన్లు దాఖలు చేశామని, క్రిమినల్ చర్యల కోసం సమన్లు కూడా సంబంధిత యజమానులకు జారీ అయ్యాయని వెల్లడించారు. అనుమతి లేని నిర్మాణాలు, అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు. పెంపుడు కుక్కలను వీధుల్లో వాటిని వదిలిపెట్టొద్దని యజమానులకు సూచించారు. తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయం నుంచి లైసెన్స్ తీసుకోవాలన్నారు. వ్యాక్సినేషన్ తప్పనిసరి అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఆత్మకూరు బస్టాండ్, మాగుంట లేఅవుట్, రామలింగాపురం బ్రిడ్జి ప్రాంతాల్లో వరద నీటిని మోటార్ల ద్వారా తోడేసేందుకు ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు.

మొత్తం 59 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 59 అర్జీలు స్వీకరించామని కమిషనర్ వెల్లడించారు. అకౌంట్ సెక్షన్‌కు సంబంధించి 9, ఆఫ్కాస్‌వి 3, ఇంజినీరింగ్‌వి 5, ఎస్టాబ్లిష్మెంట్‌వి 9, టిడ్కో హౌసింగ్‌వి 18, రెవెన్యూవి 5, టౌన్ ప్లానింగ్‌వి 5, పబ్లిక్ హెల్త్ 5 చొప్పున అందుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, టౌన్ ప్లానింగ్ సీపీ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి

నెల్లూరు(క్రైమ్): మహిళలు, చిన్నారుల సంరక్షణ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కృష్ణారెడ్డి నర్సింగ్ విద్యార్థినులకు సూచించారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం తల్పగిరి కాలనీలోని దిలీప్ నర్సింగ్ కళాశాలలో రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మహిళలు అత్యవసర సమయాల్లో శక్తియాప్‌తో రక్షణ పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. బాలబాలికలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై పోక్సో యాక్ట్ అమలు చేస్తామన్నారు. మానవ అక్రమ రవాణా చేసే ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ ఏఎస్సైలు వై.శ్రీహరి, డి.సతీష్, నర్సింగ్ కళాశాల సెక్రటరీ డాక్టర్ ప్రభుదాస్, ప్రిన్సిపల్ వసుంధర, సిబ్బంది టీవీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిని అరికడదాం

- డీఎంహెచ్ఓ సుజాత



వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో అతిసార (డయేరియా) వ్యాధిని అరికడదామని డీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెలాఖరు వరకు నిర్వహించనున్న స్టాప్ డయేరియా కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లు, బ్యానర్లను సోమవారం సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతిసార వల్ల శరీరంలోని లవణాలతో కూడిన నీరు వాంతులు, విరేచనాల ద్వారా బయటకు పోతుందన్నారు. అలాంటి సమయంలో ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. లేకుంటే కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఒక్కోదఫా ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందన్నారు. అతిసారకు గురికాకుండా ఉండాలంటే రక్షిత మంచినీరు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ వ్యాధి నివారణకు ప్రస్తుత కాలంలో టీకాలు వచ్చాయన్నారు. వాటిని పిల్లలకు సకాలంలో వేయించాలన్నారు. అన్ని పీహెచ్‌సీల డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంఓ డాక్టర్ రమేష్, డెమో అధికారి కనకరత్నం, డీసీహెచ్ఎంఓ మంజుల తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పన్నుల వసూళ్లపై దృష్టి



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి పన్నులను విధిగా వసూలు చేయాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో వారాంతపు సమీక్షను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అమెనిటీస్ కార్యదర్శులు ఉదయం 6 గంటలకు క్షేత్రస్థాయిలో ఉండి తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. అనధికార కుళాయిలను పన్ను పరిధిలోకి తీసుకురావాలని, వాటికి సంబంధించిన చలాన్లను సచివాలయాల్లోనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల వారీగా అవసరమైన ప్రాంతాల్లో కాలువల నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు వేణుగోపాల్, రామ్మోహన్‌రావు, రహంతు జానీ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు



పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆనం విజయకుమార్‌రెడ్డి

- ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడే వారికి పదవులిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం చింతారెడ్డిపాళెంలోని పార్టీ కార్యాలయంలో 22వ డివిజన్ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిన రెండు నెలల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అధికార పార్టీలో వివిధ కారణాలతో చేరారన్నారు. అధికార పార్టీ ఆగడాలకు భయపడి కొందరు పార్టీ మారారన్నారు. అయితే తాను నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్న తర్వాత పూర్వవైభవం తీసుకొచ్చానన్నారు. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో కష్టపడే వ్యక్తులకు పదవులు కల్పించి బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 26 డివిజన్ల కమిటీలు, 18 గ్రామాల కమిటీలు, మండల కమిటీలు దాదాపు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగరాధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకట జ్యోతి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్‌రావు, జిల్లా సెక్రటరీ ఆదిరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, రాధయ్య, వెంకటేశ్వర్లు నాయుడు, దశయ్య, నరేష్, సురేష్, సోము, రాము, తాటిపర్తి నరసింహ, తేజ, దిల్షన్, ఇమ్రాన్, పృథ్వీ, సజన్ తదితరులు పాల్గొన్నారు.

- రూరల్ నియోజకవర్గంలోని 22వ డివిజన్ ఇన్‌చార్జిగా శివజయంత్‌రెడ్డిని విజయకుమార్‌రెడ్డి నియమించారు.